# పాత సీసాలో కొత్త విస్కీ

బాలసుందరంగారు సాయంకాలం నడక ముగించుకొని యింటికి వచ్చేసరికి ఆ వార్త చెప్పింది భార్య పార్వతమ్మ–శంకరం మేరీ అనే అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నాడని. రెండో ప్రపంచ యుద్ధంలో తుపాకీ గుళ్ళకి, జీవితంలో రెండు గుండె పోట్లకీ అలవాటు పడిపోయిన అరవయ్యేళ్ళ ముసలి గుండె ఆ వార్తకి ఉక్కిరిబిక్కిరి కాలేదు. కాని పొద్దుటి నుంచీ – ఆ వార్త విన్నప్పటి నుంచీ – పార్వతమ్మకి రక్తపు పోటు ఎక్కువయింది. అయితే ఈ వార్త విన్నాక కూడా షెరూట్ చుట్టని నోట్లోంచి తియ్యకుండా–అలవాటుగా 'టీ' ఇయ్యి అని ఈజీచైరులో కూర్చున్న భర్తని చూశాక–ఆపోటు మరింత ఎక్కువయింది. కష్టాన్నో, దుఃఖాన్నో అనుభవించడానికి మనిషికి ఆలంబన గావాలి. ఈ రెండూ బేషరుతుగా నిరాకరించి, రెండు గుండెపోట్లతో తన గర్వానికి ముడుపు చెల్లించిన వ్యక్తి బాలసుందరం. ఆయన్ని జీవితంలో కదిలించే వార్త ఎలా ఉంటుందో ఆవిడ కింకా – ఆ ఏభయ్యేనిమిదో యేట కూడా అర్థం కాలేదు.

"నే చెప్పింది విన్నారా?"

"ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకొన్నాడా? చేసుకుంటాడా?"

"ఇంకా లేదు – ఇవాళ నాముందు మెల్లగా కదిలేశాడు. ఇద్దరూ ప్రేమించుకున్నారట".

బాలసుందరంగారికి ఆ మాటకి తుపుక్కున నవ్వొచ్చింది. "ప్రేమ" అన్న పదం బూతు మాటలాగ వినిపిస్తుంది ఆయనకి. ఆ మాటని తెలుగు సినీమా రచయితల దగ్గర్నుంచి

భావకవుల వరకు అంతా ఉదారంగా, విరివిగా వాడి అరిగిపోయిన పాతరికార్డులో అర్థం లేని పిచ్చి శబ్దంలాగ తయారు చేశారు. తన ప్రాణానికి ప్రాణమయిన మిత్రుడు – బాంబులు పడుతున్న సందర్భంలో – మీద పరుగులు తీసే ఏరోప్లేన్ల ధ్వనుల మధ్య, రాతిగుట్టల వెనక నుంచి–చిట్టగాంగ్ అడవుల్లో తుపాకులు కాలుస్తున్నప్పుడు తన భుజంలోంచి గుండు దూసుకుపోవడం చూసి, "బాలూ" అంటూ తనని రక్షించడానికి రాయి వెనక నుంచి ముందుకు దూసుకువచ్చి తను తుపాకీ గుండుకు బలి అయిపోయిన అపూర్వమయిన స్నేహాన్ని ప్రేమ అనాలా? – పేరు తెలీని పిచ్చి నవాబు ప్రేమించానని చెప్పిన ఉంపుడుకత్తెను ఆరో అంతస్తు ఎక్కించి "నన్ను ప్రేమిస్తే నా కోసం ఏమయినా చేస్తావా?" అని అడిగితే – ఆమె చిరునవ్వును ఆధారం చేసుకొని – "ఈ మేడమీంచి దూకు" అనే కోరికను అలవోకగా కోరితే, అతన్ని చేతుల్లోకి తీసుకొని, పెదాల్ని ముద్దు పెట్టుకొని ఆనందంగా కిందకు దూకి చనిపోయిన ఆమె సాహసాన్ని ప్రేమ అనాలా? – యిలా ఎన్నో మనస్సులో మబ్బు వెనక బహుళ పంచమినాటి పల్చటి వెన్నెల్లాగ జ్ఞాపకాలు కదులుతాయి.

మనిషి తన యాత్రను పూర్తిగా ముగించుకొన్నాక చివరలో పోగొట్టుకొనే విలువైన ఆస్తి ప్రాణమయితే–ఆ ఆస్తిని ఏ క్షణానయినా విరాళంగా తూకం వెయ్యగలిగే తూకపు రాయి ప్రేమ.

ఇలాంటి ఆలోచనలు ఎన్నోసార్లు ఎన్నో రకాలుగా చేసి, ఏ ఆలోచనకూ ఆ అర్థం సమగ్రంగా పొదగడం చూడలేక, జీవితంలో అలసిపోయి ఆఖరి మజీలీకి వచ్చిన యాత్రికుడు బాలసుందరం.

అందువల్ల ఎప్పుడన్నా ఎవరేనా ప్రేమ గురించి మాట్లాడినప్పుడు–అర్థం తెలీని పదాన్ని అతి చవకగా వాడే చిల్లర వ్యాపారిలాగ కనిపిస్తారు. ఇప్పుడు శంకరం ప్రేమలో పడ్డాడని తెలియగానే బాలసుందరంగారికి మొదట నవ్వు, ఆశ్చర్యం కలగలేదు. అరవయ్యేళ్ళ తన జీవితంలో యింకా తొంగిచూడని ప్రేమ, ఇరవై మూడు ఏళ్ళ కొడుకు జీవితంలో ఆ మేరీ రూపంలో తలుపు తట్టిందని విన్నప్పుడు–అది నిజమయితే–ఎలాంటిదా అన్న ఆశ్చర్యం– కాకపోతే తన నమ్మకం తప్పుకాదని రుజువు చేసుకోవాలన్న పట్టుదల కలిగాయి.

స్తంభం చాటున పడుకున్న బిహారీని చేతికర్రతో పొడిచి లేపాడు. వాడు మూగ.

"ఒరేయ్ – యివాళ విస్కీ తాగాలని ఉందిరా" అన్నాడు. బిహారికి తెలుగురాదు. కాని తన ఏభైఏళ్ళ జీవితంలో బాలసుందరం అలవాట్లనీ, సంజ్ఞల్నీ చదవడం తెలుసు. అదీకాక వాడికి రెండే తెలుసు. బాలసుందరం కష్టపడితే తనకి కన్నీళ్ళు వస్తాయని, తను కన్నీళ్ళు కార్చినప్పుడల్లా బాలసుందరం కష్టపడతారనీను!

వెళ్ళి తీసుకొచ్చాడు.

పార్వతమ్మ టీ తెచ్చేసరికి, మందు తాగడానికి ఏర్పాట్లన్నీ చూసింది. ఆమెకి ఆశ్చర్యం లేదు. డాక్టర్లే అతనిచేత మందు మానిపించాలని చూసి ఓడిపోయారు. "విస్కీ నా

గుండెని ఓదారుస్తుందా, నా గుండె విస్కీకి ఓడిపోతుందో నే చచ్చాక కాని తేలదు. గుండపోటుకీ, తాగుడికీ సంబంధం లేదని ఒక్క గొప్ప సత్యాన్ని నిరూపించడానికయినా నన్ను తాగనివ్వండి" అన్నాడాయన డాక్టర్లతో. ఆయన అన్నీ తెలిసిన మూర్ఖుడని అతని మీద ఆశ వదులుకున్నారు డాక్టర్లు.

"అయితే యివాళ భోజనం రాత్రి పదిగంటలకేనన్నమాట"

"ఊహు. ఇవాళ పన్నెండు కావచ్చు. మరో మిత్రుడు నాతో మందు తాగబోతున్నాడు"

"శంకరం. నాకంటె నలభై ఏళ్ళు ఆలస్యంగా పుట్టి, నాకిప్పటికీ అర్థంకాని గొప్ప సత్యాన్ని గుర్తించినందుకు పార్టీ యిస్తున్నాను"

ఆ మాటలోనే శంకరం వచ్చాడు—

"మాన్ ఫ్రెండ్. విస్కీ తెప్పిస్తున్నాను" అన్నారు బాలసుందరంగారు.

ఆయన మాటలు, అలవాట్లు శంకరానికి కొత్తకాదు. ఆయన జీవితంలో ఎప్పుడూ దొంగతనం లేదు. ఆయన నమ్మిన నిజాన్ని ఎప్పుడూ ఆచరించకుండా వదలలేదు. ఆచరించిన విషయాన్ని ఎవరిదగ్గరా దాచలేదు.

పిల్లల్తో కూచుని విస్కీ తాగడం ఆయనికి కొత్త అలవాటు కాదు. పిల్లలకి విస్కీ ఇవ్వడం ఇవాళ కొత్త అలవాటు.

"కంపెనీ లేదా డాడ్!" అన్నాడు.

"ఇవాళ నువ్వే—రా కూర్చో"

శంకరం మాట్లాడకుండా కూర్చున్నాడు.

చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు. "వెల్. నిన్ను యిరవై ఏళ్ళ కిందట కన్నాను. అది నా తప్పుకాదు—ఇటీజ్ ఏ బయోలాజికల్ ఆక్సిడెంట్. నాకు జీవితంలో యిరవై ఏళ్ళ మిత్రులున్నారు. కనక—యివాళ—ఫరెచేంజ్—మనిద్దరం స్నేహితుల్లాగ కబుర్లు చెప్పుకుందాం".

శంకరం శరీరంలోనూ తండ్రి రక్తమే ఉంది. ఈ ఉపోద్ఘాతం దేనికి ప్రారంభమో చూచాయగా అతనికి తండ్రి మాటల్లోకంటె, తల్లి కళ్ళలో నీళ్ళద్వారా అర్థమయింది. దీనికి అతనెప్పుడో ఒకప్పుడు సిద్ధపడే ఉన్నాడు.

"ఓకే" అని కూర్చున్నాడు.

బిహారీ వచ్చాడు. సీసా మూతవిప్పుతూ తికమకలు లేకుండా మొదలెట్టారు బాలసుందరంగారు.

"ఆ అమ్మాయి పేరేమిటి?"

"మేరీ"

"ఏ లవ్‌లీనేమ్"

షీ యిాజ్ ఏ లవ్‌లీ డేమ్ ఏజ్ వెల్"

"శభాష్! ప్రేమించావా?"

"అవును"

"పెళ్ళి చేసుకుంటావా?"

"ఊ!"

"నేనొప్పుకోక పోయినానా?"

"మీ రొప్పుకుంటారని నాకు తెలుసు"

"ఎలా?"

"కారణానికి నిలబడే దేన్నయినా ధైర్యంగా చెయ్యడం మీరే నేర్పారు కనక"

"వెరీగుడ్! మర్క్యాక్క విషయం—ఆ అమ్మాయిని ఎప్పుడయినా ముద్దుపెట్టుకున్నావా?

"లేదు"

"శరీరాన్ని రుచి చూశావా?"

మొదటి గ్లాసు అనర్గళంగా పూర్తి చేశాడు శంకరం.

"మనిద్దరం యిప్పుడు స్నేహితులుగా ఉందాం. దానికి నేనీ ప్రశ్న అడగడమే నిదర్శనం— ఇది ప్రశ్న. బెదిరింపు కాదు – గో ఎ హెడ్"

"లేదు"

"ఓకే. ఈ ప్రేమవల్ల, పెళ్ళి వల్లా వచ్చే కష్టాలు ఆలోచించేందుకు వేరే మనిషి ఉన్నారు. ఆ మనిషిని తల్లి అంటారు. అది నా పెళ్ళాం కనక ఆ నష్టాన్ని భర్తీ చెయ్యడమో, భరించేశక్తి నివ్వడమో నా పని. అందుకు కావల్సిన శక్తి, దమ్మూ రెండూ ఉన్నాయి నాకు. మరో యిద్దరు కొడుకుల్ని కనాలని ఆశ ఉంది—మరో రెండేళ్ళకి. కొడుకు పుట్టినా నా ఎనభయ్యో ఏట తద్దినం పెడతాడు. నేను ఖచ్చితంగా ఈ విస్కీ సాక్ష్యంగా కనీసం ఎనభై ఏళ్ళు బతుకుతాను—ఇవాళ ఈ పార్టీ లక్ష్యం పెళ్ళి గురించిన సాధకబాధకాలు చర్చించడానికి కాదు—ప్రేమ గురించి నిజానిజాల్ని తేల్చుకోడానికి—"

"నేనే చెప్తున్నాగా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నానని"

"అదే నేను చెప్పబోతున్నాను. ఆ మాట అనార్కలీ గురించి సలీం చెప్పాడు. అరవై ఏళ్ళు రాజ్యం చేశాడు. అనార్కలి పోయాక. హిస్టరీ నాకు తెలీదనుకో—చేసే ఉంటాడు. ఆశ్చర్యం లేదు—కాని అదేమాట నేనూ చాలామంది అమ్మాయిలకి చెప్పాను" ఆగారు బాలసుందరంగారు.

తండ్రి ఏం మాట్లాడినా, ఆ గొంతులో – అంతకంటె వ్యక్తిలో చిత్తశుద్దిని ఎప్పుడూ శంకించలేదు శంకరం. ఎందుకనో ఆయనంటే ప్రతి తండ్రి పట్లా ప్రతికొడుక్కీ ఉండే అభిమానంతోపాటు, భక్తి కూడా ఉంది.

కాస్త ఆగి "నీ ప్రేమ కథ నేనడగను—కాని నా ప్రేమకథలు కొన్ని చెప్తాను విను. నా పధ్నాలుగో ఏటనే యిప్పుడు నువ్వనుకొనే ప్రేమ నాజీవితంలో తొంగిచూసింది. పద్మ పింగాణీ బొమ్మలాగా గుండ్రంగా తెల్లగా ఉండేది. ఆ అమ్మాయిని నేను ప్రేమిస్తున్నాని

తెలిసిన తర్వాతే ఆ అమ్మాయికి పెళ్ళయిందని తెలిసింది. పొరుగు యిల్లు-తరుచు యింటికొచ్చి మా అక్కయ్యలతో గచ్చకాయలు ఆడుతూండేది. సెకెండు ఫారం చదువుతుండగా పెళ్ళయిపోయింది. పరీక్షలు నాలుగు రోజులున్నాయనగా మొగుడు ఆ ఊరొచ్చాడు. (నిడదవోలులో ఏదో ప్రెస్‌లో పని చేసేవాడు) దీపాలు పెట్టేవేళ ఆ అమ్మాయిని రెండు చేతుల్లోకి తీసుకొని ముద్దు పెట్టుకొన్నాడట. పద్మ గాభరా పడి, కోపం తెచ్చుకొని చాచి లెంపకాయ కొట్టింది. ఇంట్లో పెద్ద గొడవయింది. మొగుడు తన అధికారాన్ని చూపించి ఆ అమ్మాయి పరీక్షకి వెళ్ళకూడదని శాసించాడు. మొగుడు ముద్దుని అంగీకరించని కారణంగా ఆమె చదువు అక్కడితో ఆగింది. అప్పట్నుంచి మొగుడంటే ఒక రకయమయిన ఉదాసీనత. ఈ సమయంలో మేం ఆ ఊరు రావడం, పద్మ పరిచయం కావడం జరిగింది. ప్రేమంటే అప్పట్లో అర్థం నాకు తెలీదు. (తెలిస్తే నీకీ కథ చెప్పేవాడిని కాదు) నాతో మొగుడు గురించి, అతని ముష్కరత్వాన్ని గురించి కథలు చెప్పేది. ఇంకా కాపరానికి వెళ్లని రోజులేమో, జరిగిన ఒక్క సందర్భాన్నీ పురస్కరించుకొని రకరకాలుగా ఊహించుకొనేది. ఆమె చెప్పే ప్రతివిషయానికీ నా సానుభూతి అతి ఉదారంగా ఆమెకు లభించేది. ఆ సానుభూతికీ, తన కష్టాన్ని చెప్పుకొనే వ్యక్తిగా నా దగ్గర చొరవకీ నేను ప్రేమ అని గుర్తు పెట్టుకున్నాను. శ్రీరామనవమి ఉత్సవాలొస్తే రాత్రంతా మేమంతా కలిసి సంబరాలు చూసేవాళ్ళం. ఒక రోజు సినిమా చూస్తూయిద్దరం పక్కపక్కన కూర్చున్నప్పుడు అనుకోకుండా చీకట్లో ఆమె చేయి నా చేతికి తగిలింది. కాస్త వణికాను. "పద్మా" అని పిలిచాను. నా చేతికి తగిలింది. కాస్త వణికాను. "పద్మా" అని పిలిచాను. పిలుపు మలేరియా రోగి వణుకులాగ వినిపించింది. "ఏం" అంటూ నావేపు వంగింది. మల్లెపువ్వుల వాసన నా మొహమంతా గుప్పుమంది. ఇద్దరి ముఖాలూ దగ్గరయాయి. అనుకోకుండా చటుక్కున ఆమె పెదాలమీద ముద్దు పెట్టుకున్నాను - అంతే. నిశ్శబ్దంగా ఉన్న సినిమా హాలులో తుపాకీ పేలినట్టు చెంప దెబ్బ పేలింది. ముద్దుకి ప్రతీకారం ఆమె అనుభవంలో సిద్ధంగా ఉంది. నాకూ అదే దక్కింది. సినిమా మధ్యలో లేచి వచ్చేశాను. పది రోజులు ఆమెకి కనిపించకుండా తిరిగాను. తరవాత నాకు టైఫాయిడ్ వచ్చింది. స్పృహ లేకుండా పడి ఉన్న నాకు పద్మ చాలా సేవలు చేసిందట. నేనింకా రోగంలో ఉండగానే ఆమెకి కార్యం చేశారు-ఇంకా నిలబడడానికే ఓపికలేని నా దగ్గర శలవు తీసుకోడానికి వచ్చి "పళ్ళరసం బాగా తీసుకో-బాగా కోలుకొన్నాక-హైదరాబాద్‌రా. మా వారితో నీగురించి చెప్పాను" అంది.

నాకెందుకో కళ్ళనీళ్ళు తిరిగాయి "మళ్ళీ ఎప్పుడొస్తావు?" అన్నాను.

నవ్వింది. "ఏమో! తనకిష్టంలేని చదువు మానిపించిన మగాడు, ఎప్పుడు పంపుతాడో ఏం తెలుసు. వచ్చే ముందు ఉత్తరం రాస్తాలే-" అంది.

వెళ్ళబోతూ-అసంకల్పితంగా నావేపు తిరిగి బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.

తర్వాత సంవత్సరానికి యింటికొచ్చింది. అప్పటికి ఏడో నెలలని అక్క చెప్పింది.

మరీ ఒళ్ళు చేసి యిదివరకు కన్నా పొట్టిగా కనిపించింది-ఎత్తు పొట్టలో కాస్త అందం చెడినట్టు కన్పించేది.

నాతో ఇదివరకులాగే స్వేచ్ఛగా మాట్లాడేది.

కొడుకు పుట్టాక అతి ఆప్యాయంగా వాడిని అక్కున చేర్చుకుంటూ, నా కళ్ళముందే ఏమీ బెరుకు లేకుండా వాడికి పాలు తాగించే ఆ తల్లిని చూస్తూంటే-పద్మ నాకు మరీ దూరమయినట్టు అనిపించేది. కాలేజీలో చేరాను. పద్మ క్రమంగా నా ఆలోచనల్లోంచి శలవు తీసుకొంది. ఇదీ కథ-ఆనాటి నా ప్రేమకి అర్థం యిద్దరు వ్యక్తుల మధ్య సానుభూతి".

ఆగారు బాలసుందరంగారు. గ్లాసులో విస్కీ నింపారు. బిహారీ సోడా గ్లాసులో పోశాడు. మరో "షెరూట్" వెలిగించారు.

"రెండోసారి ప్రేమ మరో అయిదేళ్ళ తర్వాత తటస్థపడింది. ఆ రోజుల్లో కాలేజీ నాటకాల్లో నేను హీరోని. కాలేజీలో మంచి గ్లామర్ ఉండేది. అల్లరి చెప్పనే అక్కర్లేదు. ఊళ్ళో ఓ నాటక సమాజం కూడా ప్రారంభించాం. విరివిగా నాటకాలు ఆడుతూ ఉండేవాళ్ళం. బి.కాం. ఫస్ట్ యియర్‌లో సరళ అనే అమ్మాయి ఉండేది. సన్నగా, తెల్లగా మల్లెపువ్వులాంటి అమ్మాయి. ఆమె చాలా సుకుమారంగా, నాజూకుగా ఉండేది. పద్మ అందకత్తె-కాని సరళలో అందం ఆమె ఠీవి, హుందాతనం. ఆమె శరీరం అందమంతా రంగుదీ, వయస్సుదీను. కాని నాటకాల ద్వారా నేను హీరోనయితే, కేవలం తన హుందాతనంతో ఆవిడ హీరోయిన్. కొన్ని నెలలు గడిచాక నేను వేసే ప్రతి నాటకానికి మొదటి వరసలో ఆ అమ్మాయి ఉండడం గమనించాను. కాలేజీ నాటకాలే కాదు, బయట వేసే నాటకాలకి కూడా వచ్చేది-కొన్నాళ్ళయాక నాటకం వేసే ముందు ప్రేక్షకుల్లో సరళ ఉందా లేదా అని చూడడం అలవాటయిపోయింది. స్టేజీ మీద పాత్రలోంచి బయటపడి చూసే సందర్భాలన్నీ ఆమె ఆనందన్నా గమనించడానికే. నాపట్ల ఆమె ఆకర్షణ రూఢిగా అర్థం చేసుకున్నాక ఓరోజు ఉండబట్టలేక లేడీస్ వెయిటింగ్ రూమ్ ముందు పలకరించాను. "నాటకం ఎలా ఉంది?" అని. మొదట తెల్లపోయింది.

ఆమె ఠీవి ఒక ఆనకట్ట. దాన్ని ఛేదించుకుని ఎవరూ వ్యక్తితమయిన పరిచయానికి పూనుకోరని ఆమె ధైర్యం. మొదటిసారి ఇలా మాట్లాడడం కాస్త విస్మయాన్ని కలిగించింది-కాని అంతలో పాతసరళ అయిపోయింది.

"నా మొహంలాగ ఉంది-ఆ మీసాలేమిటి మరీ అంత పొడుగ్గా?" అంటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

ఆడపిల్ల హుందాగా సమాధానం చెప్తే ఆ పరిచయం అక్కడితో ఆగిపోవచ్చు. మగాడిని ఆడపిల్ల చేసే వెక్కిరింత కూడా ఒకరకమయిన చొరవే. హాస్యానికి పరిచయం కావాలి. లేదా ఎదుటి వ్యక్తిని నువ్వు వెక్కిరించడానికయినా శ్రద్ధ చూపించావనడానికి అదే నిదర్శనం.

అప్పట్నుంచీ-ప్రతి నాటకానికీ ఆ అమ్మాయిని విధిగా ఆహ్వానించేవాడిని, ప్రతిసారీ

నాటకంలో మంచిని వదిలిపెట్టి ఏదో ఒక విమర్శ చేసేది. నాటకం చూడాలన్న కోరిక ఉంది. చూసినప్పుడు ఆనందం ఉంది. కాని ఆ విషయం ఒప్పుకోవడంలో తన గడుసుదనం తనకే మిగుల్చుకోవాలి. అప్పట్లో నన్ను ఆకర్షించిన సరళలో అందం ఆ గడుసుదనమే.

వాళ్ళ నాన్న తాసీల్దారు. రాజమండ్రి బదిలీ అయి చదువు మధ్యలోనే రాజమండ్రి కాలేజీకి బదిలీ చేయించుకుని వెళ్ళిపోయింది. అక్కడితో న్యాయంగా ఆ కథ ముగిసిపోవచ్చు. కాని మరో నెలరోజుల్లో ఉత్తరం రాసింది. "మళ్ళీ ఏమయినా కోతి వేషాలు వేస్తున్నావా?" అని. ఈసారి వెక్కిరింత నా మనస్సుకి తాకలేదు. కాని రాజమండ్రి వెళ్ళాకకూడా నన్ను మరిచిపోలేక పోయిందన్న నిజం, ఆ నిజాన్ని గుర్తించగలిగినందుకు ఒక గర్వం కలిగాయి. రెండేళ్ళు కాలేజీలో నా సమక్షంలో ఉన్నప్పుడు ప్రారంభం కాని—జబ్బు ఒకటి—ఆమె దూరమయాక ఆ ఉత్తరం కారణంగా ప్రారంభమయింది. దాన్ని "ప్రేమ" అంటారని తర్వాత గుర్తు పట్టాను. క్రమక్రమంగా రోగం ముదిరింది. లైబ్రరీలో పుస్తకాలన్నీ తిరగేసి కవిత్వం ఒలకబోసి వెన్నెలా, చంద్రవంకా, మలయ పవనం, హృదయం అంటూ పేజీలు నింపేవాడిని. విచిత్రంగా ఆమె దగ్గర్నుంచీ సమాధానం వచ్చేది. ఆ ఉత్తరాలు కాంపోజిషన్ దిద్దే స్కూలు టీచరు రిమార్కుల్లాగ ఉండేవి – "మలయ పవనం క్లాసు రూమ్‌లో వీస్తుందంటావేమిటీ? అంత తెలియకుండా చచ్చు ప్రయోగాలు చేయడం ఉత్త తెలివితక్కువతనం" యిలాగ. కాని ఉత్తరం వచ్చేది. క్రమంగా పోస్టుమాన్ ప్రాణావసరమయిన మిత్రుడిలాగ కనిపించేవాడు. సమాధానాల్లో వ్యంగ్యం అపుడప్పుడు తగ్గేది—కాని రావడం మాత్రం ఆగలేదు. ఆ వేసవి శలవుల్లో విజయవాడ వెళ్తూ రాజమండ్రిలో దిగాను.

బదిలీ మీద ఊరు వదిలి వెళ్ళిపోయాక అదే మేమిద్దరం కలుసుకోవడం. అప్పటికీ కేవలం పరిచయంగానే ప్రారంభమయిన మా బాంధవ్యం యిప్పుడు ముదిరి ఊసరవిల్లి అయిందని యిద్దరు గుర్తుపట్టాం. స్టేషన్‌కి వచ్చి నన్ను పలకరించినప్పుడు ముఖం ఎర్రబడడం; మల్లెపువ్వులు, పట్టుచీర ప్రత్యేకమయిన అలంకరణ గుర్తు పట్టాను. చీర భుజం చుట్టూ తిప్పుకొంది. సరళ పెద్దమనిషిలాగ తయారయితే బాగుండదు. ఆమె హుందాగా, ఠీవిగా అల్లరిచేసే కుర్రాళ్ళ మధ్యనుంచి నడిచిపోయే సామ్రాజ్ఞిగా తెలుసు.

సాయంకాలం యిద్దరం గోదావరి ఒడ్డుకి నడిచి వెళ్ళాం. ఇద్దరికీ మాటలు పెగలవు. నాకు ఎదురుగ్గా—గోదావరి వేపు వీపుంచి కూర్చుంది. ఇన్ని పేజీల ఉత్తరాలు రాసుకున్న మధ్య మాటలు కరువయ్యాయి.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానని తెలుసా?" అన్నాను. ఎంత అర్థంలేని ప్రశ్నో యిప్పుడు తలుచుకుంటేనే నవ్వొస్తుంది.

"అది చెప్పడానికి యింతదూరం వచ్చారా?" అంది నవ్వుతూ.

నిశ్శబ్దంగా ఉంటే సరళకి ఏం మాట్లాడాలో తెలీదు. కాని ఎవరయినా మాట్లాడితే ఎలా వెక్కిరించాలో తెలుసు. మాకు తెలియకుండానే పెళ్ళి, పిల్లలూ, కుటుంబ

జీవితం– యిలాంటి విషయాలెన్నో మాట్లాడాను. కనీసం నలభై ఏళ్ళ అనుభవంతో పండి ముదిని వాడిలాగ సరళ అన్నీ వింటూ కూర్చుంది.

చీకటి పడ్డాక–యిద్దరం లేచి నిలబడ్డాం. సరళ ముఖంలో ఎందుకనో యింటివేపు మళ్ళుతున్న కొద్దీ నిరుత్సాహం కనిపించింది. అది యివాళ ఆలోచిస్తే అర్థమవుతుంది. అన్ని ఉత్తరాలు రాశాక సహజంగా మగాడు తీసుకొనే చొరవ ఆమె ఊహించి ఉంటుంది. తనని చేతుల్లోకి తీసుకుంటాననో లేకపోతే గట్టిగా కావలించుకుంటాననో అనుకొని ఉంటుంది. కాని నేనింకా పద్మ అనుభవం మరిచిపోలేదు.

"ముద్దు పెట్టుకోనా?" అన్నాను. నది దాటి వెలుగు తక్కువగా ఉన్న చోటుకి వచ్చినప్పుడు.

"పెళ్ళయ్యాక పర్మిషన్ అడుగుదురుగాని – ఒక సాయంకాలం ఆలస్యంగా మీకింత అపురూపమైన ఆలోచన రావడం అమోఘం" అంది.

అంతే–తరవాత నేను రైలెక్కాను. ఆ సాయంకాలం నాలో మగాడి చొరవని చూడలేకపోవడం సరళని నిరుత్సాహపరిచింది. ఆమెలో మగాడిని ప్రతిక్షణం చిన్నవాడిని చేసే వ్యంగ్యం నన్ను చికాకు పరిచింది. తర్వాత సరళ నాకు ఉత్తరం రాయలేదు. బహుశా ఆ పరిచయానికి ముగింపు కేవలం అనుభవమని సరళ అనుకొని ఉండవచ్చు. 'పెళ్ళి' అని నేననుకోవడం నా పొరబాటేమో!

ఏమయినా తర్వాత సరళ ఉత్తరాలు రాలేదు. ఆశ్చర్యంగా పోస్ట్‌మాన్ క్రమంగా నా ఆకర్షణ నుంచి మళ్ళిపోయాడు. రెండోసారి ప్రేమ కేవలం హుందాతనం పట్ల ఆకర్షణగా గుర్తుండిపోయింది.

శంకారానికి ఫక్కున నవ్వొచ్చింది.

"రెండుసార్లూ నువ్వే ఫూల్‌వయావన్నమాట?"

బాలసుందరం నవ్వాడు. "రెండుసార్లే అయానోయ్. జీవితమంతా ఫూల్ అవుతూండడమే ప్రేమకి అసలయిన అర్థం కాకవచ్చు. మూడోసారి మాత్రం ఫూల్‌ని కాలేదు. మలయపవనం, మాధవీలత యివన్నీ అటకెక్కించేశాను. శ్రీదేవిని ఎన్.సి.సి. స్క్వాడ్రన్ లీడర్‌గా ఉన్నప్పుడు చూశాను. మనిషి నలుపుకాని శరీరంలో అవయవాల అందానికి సజీవమయిన ఉదాహరణలాగ ఆ అమ్మాయి కనిపించింది. మనిషి అందం పిచ్చెత్తించిన సందర్భమది. ఎందుకనో ఆమె కోసమే నేను జీవితమంతా ఎదరు చూస్తున్నట్టు–ఆక్షణం–ఆమె నాకళ్ళబడినప్పుడే దగ్గరయినట్టూ అనిపించింది. కవాతు చేస్తూ నలుగురి మధ్యా రిపబ్లిక్ డే పెరేడ్‌లో ఆమెను చూశాను. ఎంత ప్రయత్నం చేసి ఆమె ఉనికిని పట్టుకున్నానో చెప్పలేను. ఆటోమొబైల్ కంపెనీలో స్టెనో. ఫోను చేసి ఆమెతో మాట్లాడినప్పుడు ఆమె గొంతులో తియ్యదనం నన్ను ముగ్ధుడిని చేస్తే, ఓ నూతన వ్యక్తి పలుకరింత ఆమెను భయపెట్టింది. ఇలా ఆడపిల్లల వెంటబడడం నా అలవాటేమో అనుకొందట. ప్రతిరోజూ

పనిగా ఫోను చేసేవాడిని. కేవలం ఆమె కోసం ఓ మోటార్ సైకిల్ కొన్నాను. రిపేర్ లేకపోయినా కంపెనీ చుట్టూ తిరిగేవాడిని. అప్పటి నీ వయసు. నీ మేరీని ముద్దు పెట్టుకున్నావా అంటే నువ్వు సిగ్గుపడ్డావు. కాని నేనా రోజుల్లో ఆ అమ్మాయితో అనుభవించని సుఖం లేదు. ఇప్పటికీ వెనక్కి తిరిగి చూసుకుంటే ఆమెతో గడిపిన మధురమయిన క్షణాలు, శారీరకంగా మీ అమ్మతో కూడా గడపలేదేమో. ఏమై బికమింగ్ పర్సనల్?" ఆగారు.

శంకరం నవ్వాడు. "మరి పెళ్ళి చేసుకోలేదేం?"

"అవును – ఇటీజ్ ఎ థౌజెండ్ డాలర్ క్వశ్చన్. ఆ అమ్మాయికి అప్పటికి మైనారిటీ తీరి ఉంటే అమ్మా, నాన్నా, దేవుడు, దెయ్యం అన్నిటినీ అందిరినీ మరిచిపోయి – రిజిస్ట్రార్ ఆఫీసులోనో పెళ్ళి చేసుకొనేవాడిని. కాని ప్రేమ ఆడదాని సెక్యూరిటీకి మార్గమయితే మగాడికి అడ్వంచెర్. నలుగురి దృష్టిలో మా స్నేహానికి బలమయిన సాక్ష్యం ఏర్పరచుకోవాలని ఆమె తొందరపడింది. ఇంట్లో తల్లిదండ్రులకి చెప్పింది. అంతే. పెద్ద అగ్నిపర్వతం బద్దలయింది. ఇద్దరి కులాలు వేరు. వాళ్ళ నాన్న నామీద విరుచుకు పడ్డాడు. గ్రౌండ్సులో ఆర్డర్స్ ఇచ్చే స్క్వాడ్రన్ లీడర్ గొంతుతో "గోటు హెల్" అని చెప్పాను. ఏడ్చి మొత్తుకుని నన్ను సాధించలేక మా నాన్నకి ఉత్తరం రాశాడు. మూడో రోజున మా అమ్మా నాన్న హఠాత్తుగా రైలు దిగారు. అరవై ఏళ్ళ ముసలాయనకి నేను ఆలస్యంగా పుట్టిన కొడుకుని. ఏకైక పుత్రుడిని. అమ్మ వచ్చిందగ్గర్నుంచీ గోలగోల పెట్టేసింది. మా నాన్న నీ నాన్నలాంటివాడు కాదు. కాస్త మెతక–నా ముందు చాలా దీనంగా ఓ గంట మాట్లాడాడు. "నిన్ను చంపుతామని వాళ్ళు ఉత్తరం రాశారు–గారంగా పెంచిన కొడుకుని కేవలం అమ్మాయి కారణంగా హత్య చేస్తామని ఎవరో బెదిరిస్తున్నారంటే నేనెలా బాధపడతానో ఊహించు–ఇరవై మూడేళ్ళు పెంచిన తల్లిదండ్రుల మీద లేని ప్రేమ, ఆరునెలల్లో ఆమె మీద కలిగిందంటే నేను నోరు మూసుకుంటాను – ఇది వయస్సులో కలిగే ప్రమాదం అని అర్థం చేసుకోగలిగితే ఆ అమ్మాయిని మరచిపో. లేకపోతే నీ యిష్టం. 'యింతకన్నా నేను చెప్పేది లేదు" అన్నారు.

"చెప్పాల్సిన అవసరమూ కనిపించలేదు. శ్రీదేవి తండ్రి ఆమెను బెల్టుతో చావబాది మామయ్యతోబాటు అహమ్మదాబాద్ పంపేశాడు. ప్రేమలో ఉండగానే పెళ్ళి గురించి తొందరపడిన పాపానికి ఏకం కావలసిన జీవితాలు విడిపోయాయి. ఆలోచించినకొద్దీ అమ్మా నాన్నను ధిక్కించుకోవలసిన అవసరం నాకు కనిపించింది. వాళ్ళని కాదని దూరం కావడం అసాధ్యమని ఇరవై మూడేళ్ళ జీవితం సాక్ష్యం చెప్పింది. బాధపడి, ఏడ్చి, విసిగి 'మీ యిష్టం వచ్చిన అమ్మాయిని వెదకండి–ఆమెను చూడకుండా తాళికడతా'నన్నాను. 'మీ అమ్మని చూపించారు–మూడు నెలల్లో పెళ్ళయిపోయింది – ఈ ప్రేమకి అర్థం కోరిక. దాన్ని సంప్రదాయం, బాంధవ్యం అతిసులువుగా జయించాయి."

ఆగారు బాలసుందరంగారు. శంకరం ఉన్నట్టుండి తుపాకీ పేల్చినట్టు ఓ ప్రశ్న అడిగాడు. "మరి అమ్మనయినా ప్రేమించారా?"

బాలసుందరంగారు లేచి పచార్లు ప్రారంభించారు - "మంచి ప్రశ్న అడిగావు. నిజం చెప్పమంటావా?"

"చెప్తారనే నా నమ్మకం"

"అయితే విను. మీ అమ్మమీద ఇంతవరకూ ప్రేమ లేదు-నాతో ముప్పయి అయిదే ఏళ్ళపైగా జీవితం పంచుకొంది. నాకు రోగం వస్తే సేవలు చేసింది. మొదటి రోజుల్లో శ్రీదేవిని తల్చుకున్నప్పుడల్లా ఆమెతో పెళ్ళి పెద్ద 'రాజీ' అని గుర్తు వస్తుండేది. కాని ప్రేమతో సాధించనిది మీ అమ్మ సేవలు చేసి సాధించింది. నాకు పిల్లల్ని కంది. నిజాయితీగా నన్నొక్కడినే నమ్ముకొంది. నిజం చెప్పాలంటే యిది ప్రేమ కాదు-'రాజీ'. మళ్ళీ జీవితంలో అవకాశం వస్తే-మీ అమ్మనే పెళ్ళి చేసుకుంటానేమో-ఎందుకంటే "షీయీజ్ ఏన్ ఐడియల్ వైఫ్. కాని, ఐడియల్ లవర్? నో. యిప్పటికీ ఆత్మవంచన చేసుకోలేను -" ఆగారు. కుర్చీలో కూర్చుని గ్లాసులో విస్కీ పోసుకున్నారు. అంతలో బిహారీ ఎత్తి తాగబోయే ఆ గ్లాసుని లాక్కున్నాడు. 'ఇంకవద్దు' అని తల ఆడించాడు. ఆకలి వేసే కుక్క జాలిగా అన్నం అడిగినట్టు.

"సరే తాగను పోరా-" అన్నారు. అంతలో కొడుకువేపు తిరిగి "చిట్టగాంగ్‌లో ఉండే రోజుల్లో వీడు నా ఆర్డర్లీ - బూట్లు పాలిష్ చేసి బట్టలుతికేవాడు. నేనక్కడ ఉండే రోజుల్లోనే వీడి పెళ్ళాం చచ్చిపోయింది. నేను మిలటరీలోంచి రిటైరయి వచ్చేస్తూంటే పెళ్ళాం పోయినప్పటికంటె గుండె బాదుకుని ఏడ్చాడు. ఓదార్చి రెండు వందలు చేతిలో పెట్టి రైలెక్కాను. పదిహేను రోజులు తిరక్కుండా నన్ను వెదుక్కుంటూ వచ్చేశాడు. అప్పట్నుంచీ నాతోనే ఉన్నాడు. డాక్టర్లు కూడా నా ముందు సాధిచలేని విజయం వాడు సాధించాడు. ఈ మందుని నా గుండెపోటు కూడా ఆపలేక పోయింది. వీడొక్కడే ఆపగలడు. నేను తాగితే ఆ వెధవ ఏడుస్తాడని భయపడి తాగను. నేను కష్టపడితే వాడికి కన్నీళ్ళొస్తాయి వాడు కన్నీళ్ళు కార్చినప్పుడల్లా నేను కష్టపడతాను-లవ్‌లీబాయ్. జీవితంలో ప్రేమకు నాకు తెలిసిన ఉదాహరణ చెప్పమంటే వీడిని చెప్తాను. అవును-నేను బిహారీని ప్రేమిస్తున్నాను" - ఆ మాటలంటూంటే బాలసుందరంగారి కళ్ళలో కన్నీళ్ళు తిరిగాయి. లేచి విస్కీ సీసామూత పెడుతున్న బిహారీ జుత్తు నిమారారు. వాడు తన మాట విన్న యజమానివేపు చూసి విశ్వాసంతో తోకాడించే కుక్కలాగ విలవిలలాడాడు.

శంకరానికీ కళ్ళనీళ్ళు తిరిగాయి.

పార్వతమ్మ వచ్చి భోజనానికి లేవమని కసిరింది.

"నా ఉపన్యాసం అయిపోయిందే. వడ్డించు" అన్నారు బాలసుందరంగారు. శంకరం వేపు తిరిగి. "ఈ కథలు చాలనుకుంటాను - నీ జీవితంలో ప్రేమని నీ అంతట నువ్వు గుర్తు పట్టడానికి. ఇంత విన్నాక కూడా మేరీని ప్రేమిస్తున్నానని నీకనిపిస్తే కారణం చెప్పకు.. ఇంకేమీ చెప్పకు. పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావో చెప్పు-అది ప్రేమ అనిపిస్తే"

శంకరం లేచాడు. అర్ధరాత్రి ముసలి ఫాన్ కిరాకిరా చప్పుడు చేస్తోంది. చీకట్లో దూరాన ఎక్కడో మున్సిపాలిటీ దీపం వెలుగు కనిపిస్తోంది. బాలసుందరంగారు ఏమీ మాట్లాడలేదు. కొడుకు వంకే తదేకంగా చూస్తున్నారు – ఎంతోసేపటికి తండ్రివేపు తిరిగాడు శంకరం.

"థాంక్యూ డాడ్. చాలా మంచి పార్టీ యిచ్చారు. ఈ రోజు మరిచిపోలేను. తండ్రిలో మొదటిసారిగా మంచి స్నేహితుడిని పరిచయం చేసుకున్నందుకు గర్వపడుతున్నాను"

బాలసుందరంగారు నవ్వారు – "నేనడిగింది మేరీ విషయం"

"అవును మేరీ విషయం. యింత విన్నాక బహుశా–అవును పెళ్ళి చేసుకోలేను – రేపే ఆ విషయం చెప్పేస్తాను ఆమెతో."

ఆయనకు ఆశ్చర్యం కలగలేదు. ప్రేమ గురించి యిన్నేళ్ళ తన అభిప్రాయం తప్పుకానందున ఆయన ఆనందపడ్డారు – కాని ఒక సంశయం మిగిలిపోయింది.

భోజనానికి లేచి పెరట్లో కాళ్ళు కడుక్కుంటూ–కొడుకుని అడిగారు–

"నేను ప్రతిసారీ ప్రేమ గురించి రకరకాల గుర్తులు పెట్టుకొన్నానే–ఇప్పటికి నీ ప్రేమకి అర్థం ఏమిటి?"

"జాలి"

"ఎవరిమీద?"

"ఆ అమ్మాయి పేదరికం మీద. ఎక్కువ చదువుకోలేని ఆమె నిస్సహాయత మీద–రెండు పూటలా భోజనం చెయ్యలేని ఆమె కుటుంబ పరిస్థితి మీద. ఆకలికి యింకా నాకు అర్థం తెలీదు. కానీ పేదరికంలోఆమె కుంచుకుపోయి బతకడంలో వింతగా కొత్తగా కనిపించింది నాకు – దట్సాల్"

బాలసుందరంగారు ఆశ్చర్యపోయారు–అరవై ఏళ్ళ తన జీవితంలో పేదరికం పట్ల జాలిని కూడా ప్రేమగా అపార్థం చేసుకోవచ్చునని ఆయనకి తోచలేదు! తన ముందుతరం ఏదో కొత్త సౌందర్యాన్ని అన్వేషిస్తోంది – ఇంకా గుండెబలం చాలడం లేదు–అనుకొని భోజనానికి ఉపక్రమించారు.

-----